# తిరిగొచ్చిన వెన్నెల

ప్రతాప రవిశంకర్

**ఆ రాత్రి మళ్ళీ వెన్నెలొచ్చింది. ఆకాశం నిండా కమ్ముకున్న నల్లని మబ్బులను చూస్తే వర్షం వస్తుందేమో అనుకుంది. కానీ ఎవరో అదిలించినట్టుగా మబ్బులన్నీ మాయమై చూస్తుండగానే వెన్నెలొచ్చింది.**

అలివేలుకు సంతోషమేసింది ఆ వెన్నెలను చూస్తే. కానీ ఆ సంతోషం ఎంతోసేపు నిలవ లేదు. ఆమె ముఖం నిండా విచారం అలము కుంది. అందుకు కారణం శేషగిరి. శేషగిరి ఆ సాయంత్రం సొంతపని మీద ఏదో ఊరికి వెళ తాననీ, ఆ రాత్రికి తిరిగిరాననీ ఆ క్రితం రోజు రాత్రి ఆమెను డాబామీద కలుసుకున్నప్పుడు అలివేలుతో చెప్పాడు. అతని సమక్షంలో లేని వెన్నెల అలివేలుకు బేలగా అనిపించింది.

వెన్నెల్లో డాబామీద ఒంటరిగా కూర్చున్నది అలివేలు. ఉండీ ఉండీ చల్లని గాలి వీస్తోంది. వేసవికాలం సాయంత్రాలు అందంగానూ, ఆహ్లాదకరం గానూ ఉంటాయి. గాలి వంటికి తగుల్తుంటే అలివేలుకు హాయిగా ఉంది.

ఆమెకు నిమిష నిమిషానికీ శేషగిరే గుర్తుకు వస్తున్నాడు. తల్చుకుంటే ఆమెకు అంతులేని ఆశ్చర్యం కలిగింది. రెండు నెలల క్రితం అతనెవరో తనకు తెలీదు. కానీ ఇప్పుడు తన ఆలోచనల నిండా తనే అయి కూర్చున్నాడు. తన మదినంతటినీ ఆక్రమించు కున్నాడు.

తన జీవితానికో వెలితి ఉంది. ఆ వెలితి తన భర్త ఆనందరావు. అతనిప్పుడు లేడు. ఆరు నెల్ల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో తనని ఒంటరి దాన్ని చేసి వెళ్లిపోయాడు. సముద్రం ఒడ్డున తడి ఇసుకలో పడిన పాదముద్ర మీదికి నీళ్లు చేరినట్టు ఆనందరావు లేనితనం వల్ల ఏర్పడిన ఖాళీలోకి శేషగిరి ప్రవేశించాడు.

కింద ఎవరో గేటు తెరిచిన చప్పుడవ దంతో అలివేలు ఆలోచనలకు అంతరాయం కలిగింది. నిముషం తర్వాత కూతురు శోభ మెట్ల మీద నుంచి పైకి వస్తూ కనిపించింది. ఒకవేళ శేషగిరి వచ్చాడేమోనని ఆశపడిన అలివేలు కూతుర్ని చూసి నిరాశగా-

"సినిమాకు వెళ్లలేదా?" అనడిగింది.

"ఎక్కడా? దాని సింగారింపు ఒక పట్టాన తెమిలితేనా? తీరా థియేటర్‌కి వెళ్లేసరికి టిక్కెట్లు అయిపోయాయి. ఇంకెక్కడి సినిమా? మళ్లీ రేపు ట్రై చెయ్యాలి" అన్నది శోభ తల్లి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ.


శేషగిరి వచ్చి ఉంటే ఆ కుర్చీలో కూర్చునే వాడు. ఇంకా అలివేలుకు ఆశ చావలేదు. మన సులో ఏదో ఒక కార్నర్‌లో అతను వస్తాడనే అనిపిస్తోంది.

కూతురు తల్లో పెట్టుకున్న మల్లెపూల పరి మళం గుబాళిస్తోంది. వెన్నెల్లో శోభ చెవులకు పెట్టుకున్న బంగారు పంజరాలు మెరుస్తు న్నాయి.

స్నేహితురాలు శారదతో కలిసి కూతురు ఫస్ట్ షో సినిమాకు వెళ్లి ఉంటే - శేషగిరి వచ్చి ఉంటే బావుండేదనుకుంది అలివేలు.

శోభ డిగ్రీ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఉద్యో గాలకు పోటీ పరీక్షలు రాస్తోంది

"ఇంకెందుకు? చదు వుకుంటాను. నువ్వా కిందకు వస్తావా?" అన డిగింది శోభ నిల్చుని.



"నువ్వెళ్లు... కొంచెం ఆగి వస్తాను".

వెళ్లింది శోభ తల్లిని అదోలా చూసి – తల్లి అలా అంటుందని శోభకు తెలుసు. ఆ రోజు తల్లి ఎదురుగా ఉన్న కుర్చీలో శేషగిరి లేకపోవటం ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగించింది. వచ్చి వెళ్లాడేమో అనుకుంది. కానీ తల్లి కనులలో కనపడుతున్న అసంతృప్తినీ, నిరాశనూ చూసి ఇంకా రాలేదనుకున్నది.

కూతురు వెళ్లిన తర్వాత అలివేలు ఆలోచనలు శోభ మీదకు మళ్లాయి.

శేషగిరితో తన సాన్నిహిత్యాన్ని కూతురు ఏమనుకుంటున్నది? ఈ దగ్గరితనాన్ని ఆమె అంగీకరిస్తుందా? ఎటూ తేల్చుకోలేకపోయింది. డిగ్రీ పాసయిందని ఒకసారి శేషగిరి ఖరీదయిన పెన్ సెట్‌ను తీసుకువచ్చాడు శోభకు ఇవ్వటానికి. కానీ శోభ తీసుకోలేదు. వద్దన్నది మొండిగా– శేషగిరి బాధపడక తప్పలేదు.

ఆనందరావు స్థానాన్ని తను శేషగిరికి ఇవ్వటానికి సిద్ధపడినా తండ్రి స్థానాన్ని తను అతనికివ్వటానికి అంగీకరించలేదని అనుకున్నది. అలాగని కూతురు అతన్ని ఏమీ అనేది కాదు. ద్వేషించినట్టు కనపడేది కాదు.

కానీ– పది రోజుల క్రితం తల్లీ కూతుళ్లు ఎగ్జిబిషన్ చూట్టానికి బయల్దేరారు. సరిగ్గా అప్పుడే వచ్చాడు శేషగిరి. విషయం తెలుసుకుని అతను వాళ్లతో బయల్దేరాడు.

ముగ్గురూ ఎగ్జిబిషన్‌కి వెళ్లారు.

అక్కడి ఖర్చంతా శేషగిరిదే. అతను డబ్బు దగ్గర వెనకాడేవాడు అవకపోవడంతో అలివేలు సంతోషించింది. చాలా విషయాల్లో ఆమెకు భర్త ఆనందరావే గుర్తుకు వచ్చాడు.

అతనూ అంతే. భార్యా కూతురి మనసును చదివినట్టు ప్రవర్తించేవాడు.

జయింట్‌వీల్‌ను ఎక్కడమంటే తల్లీకూతుళ్లిద్దరికీ చాలా సరదా. సరిగ్గా అక్కడకు రాగానే శేషగిరి రెండు టిక్కెట్లు తీసుకు వచ్చి "మీరిద్దరూ ఎక్కండి" అని అలివేలుకు టిక్కెట్లను ఇచ్చాడు. తల్లితో తనూ వెళ్లి జయింట్ వీల్‌ను ఎక్కింది శోభ.

రెండు గంటలసేపు ముగ్గురూ కలిసే తిరిగారు. శోభకి నెయిల్ పాలిష్ సెట్టూ, అరడజను రకాల హేర్ క్లిప్పులనూ తనే కొన్నాడు శేషగిరి. అతని టేస్టుకు వాళ్లిద్దరూ ఆశ్చర్యపడ్డారు. అప్పుడు మాత్రం శోభ సరిగ్గా తన తండ్రి కూడా ఇంతేననుకున్నది.

తమకు లేనిదాని గురించే ఎవరయినా ఆలోచిస్తారనీ, అందుకోసమే ఎదురుచూస్తారనీ అలివేలు ఉద్దేశం. అందుకేనేమో రైతు బజార్లో ఓ రోజు పరిచయమయిన శేషగిరిని ముందు తమ ఇంటికి ఆ పైన జీవితంలోకి ఆహ్వానించగలిగింది. భర్త లేని లోటు తనని తీవ్రంగా కలచివేసింది.

తమ భర్తకు అన్యాయం చేస్తున్నదనే ఆలోచన అలివేలుకు ఇప్పటికీ లేదు. ఇప్పటికీ ఆనందరావంటే తనకు ప్రేమ ఉంది. అతను పోయినా అతనిమీద తనకున్న ప్రేమలో అవగింజంతయినా తగ్గలేదు. అంతమాత్రాన ఆ తలపులతోనే జీవితాన్ని వెళ్లదీయాలనుకోవటం సాధ్యం కాదని అలివేలు నమ్మకం. తను శేషగిరికి మానసికంగానే దగ్గరయ్యింది. అంతేగానీ శారీరకంగా అతనికి దగ్గరవ్వాలని ఇంతవరకూ అనుకోలేదు. అతను కూడా మాటల్లోగానీ, ప్రవర్తనలోగానీ ఆ తాపత్రయాన్ని తన ముందు ప్రదర్శించలేదు.

ఇలా అలివేలు ఆలోచిస్తున్నప్పుడే శేషగిరి ఉన్నట్టుండి మెట్లెక్కి పైకి వచ్చాడు. వెంటనే అతని రాకను ఆమె గమనించలేదు.

"అలివేలూ" అని అతను పిలిచిన తర్వాత ఉలిక్కిపడి ఆనక సంతోషపడింది.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని "బస్సు దిగి ఇటే వస్తున్నాను" అన్నాడతను.

"రాత్రికి రానన్నారు గదా!" అన్నది చిరునవ్వుతో.

"వెళ్లిన పనయ్యింది. వచ్చేశాను".

ఇంకేం మాట్లాడాలో అలివేలుకు తెలీలేదు. ఆకాశంలో వెలుగుతున్న చంద్రుడిని చూసింది. నవ్వుతున్నట్టున్నాడు.

"మీరు రారనుకుని కిందకు వెళదామనుకుంటున్నాను. మంచినీళ్లు ఇవ్వమంటారా?" లేవబోతూ అన్నది.

"వద్దు... కూర్చో".

వెన్నెల్లో శేషగిరి మొహం మీద ఒకవైపు నీడపడుతోంది. పొడుగు చేతుల షర్టు వేసుకుని చేతుల దగ్గర కొంచెం మడిచాడు. ఎడమ చేతికి ఉన్న వాచీ వెన్నెల్లో మెరుస్తోంది.

శేషగిరి వస్తే ఏదో మాట్లాడాలని అనుకుంది అలివేలు. కానీ అతను ఎదురుగా వచ్చాక మరచిపోయింది. ఆమె ఆ మరచిపోయిన విషయం గురించి ఆలోచిస్తున్నప్పుడు అతను లేచి– "ఇక వెళతాను" అన్నాడు.

"ఇప్పుడేగా వచ్చారు. కూర్చోండి" అన్నది అలివేలు.

## దంపతులకు ఉచిత పరీక్షలు!




**ఈ** మధ్య న్యూయార్కు టైమ్స్‌లో వచ్చిన రిపోర్టు ఆసక్తికరంగా ఉన్నది. 'ది న్యూయార్క్స్ అసోసియేషన్ ఫర్ మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ థెరపీ' అనే స్వచ్ఛంద సంస్థ రాబోయే వాలెన్‌టైన్ వీక్ సందర్భంగా దంపతులకి ఉచిత పరీక్షలు చేయటానికి తలపెట్టారు. డేవిడ్ అల్‌సన్ అనే సంస్థ అధ్యక్షుని మాటల్లో –"ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిస్థితిని సంవత్సరంలో ఒక్కసారయినా చెకప్ చేయించుకుంటారు. కానీ దంపతులు తమ దాంపత్య జీవన ఆరోగ్యాన్ని మాత్రం 'అంతా సవ్యంగానే ఉంది' అనే భావనతో ఎటువంటి పరీక్షలూ చేయించుకోరు. దంపతులు తమ దాంపత్య జీవితం ఏ విధంగా నడుస్తున్నది అని తెలుసుకొని అవసరమైన సర్దుబాటులు చేసుకోవటానికి ఇటువంటి చెకప్ ఎంతయినా అవస రము" అని. ఈ పరీక్షల్లో భాగంగా దంపతులు ఒక గంట థెరపిస్ట్‌తో ఆంతరంగికంగా కలిసి దాంపత్యంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలూ, అనుభవిస్తున్న సుఖాలు క్షుణ్ణంగా చర్చిస్తారు. చర్చల అనంతరం థెరపిస్ట్ వారికి ఒక 'కపుల్స్ సమ్మరీ షూట్' ఇస్తారు. ఆ షీటులో వారి దాంపత్య జీవితంలో తను గ్రహించిన బలాలు, బలహీనతలు పేర్కొని వారి జీవితం వృద్ధి చెందడానికి తగిన సలహాలు ఇస్తారు. అనుభవం గల థెరపిస్టులు చెప్పేదేమంటే 'దంపతులు తమ ఉద్యోగాలు, పిల్లల పెంపకం, జీవిత ఒత్తిడులతో సతమతమవుతూ తమ దాంపత్య జీవితం గురించి ఆలోచించటమే మరచిపోతారు' అని. పైగా దంపతుల మధ్య సరైన అవగాహన కలిగించుకునే పద్ధతి లేకపోవడము కూడా ఒక పెద్ద లోపమని అంటారు థెరపిస్టులు.

**– వి.కె.మోహన్**

## అనురాగ బంధాలు..!!

అది ఒక సంధ్యా సమయం...
అంబర వీధిలో చంద్రోదయం...!
ఆణిముత్యాల్లా కనువిందు చేసే
నక్షత్రదర్శనం..
మలయ పవనాలు సుగంధ
పరిమళభరితం!!
సముద్ర తీరాన ఆనంద తరంగాల
సోయగం..
విద్యుద్దీపాలంకరణలతో
శోభాయమానం..!!
విశ్రాంతి కోసం వచ్చిన
జనసందోహం..
చిన్న చితక వ్యాపారుల చిరుతిండి
కోసం
అల్లరి వయసుల వారి చిలిపి
ఆర్భాటం..!
పిచ్చాపాటి కబుర్లతో సరదాగా
కాలక్షేపం..
యువతరంలో విరిసింది ఓ కాంతి
పుంజం..!!
అది చెప్పలేని కోరికల తన్మయత్వం..
అదేమిటో చెప్పాలని కోరింది



అనురాగబంధం..!
అటువైపుగా వచ్చింది ఓ వృద్ధ
దంపతుల ద్వయం..
ఒక్కసారి గతాన్ని తెరిచిన
పుస్తకంలా..
పేజీలను తిరగవేస్తూ తమ
స్మృతిపథంలో
విరబూసిన అలనాటి
మధురానుభూతుల్ని..
స్మరించుకుంటూ ఊహల పల్లకిలో
విహరించారు..!!
ప్రకృతి సౌందర్యాన్ని అలా
స్వాదిస్తోంటే...
ఏ వయసు వారికైనా అవి మధుర
క్షణాలే..!
కులమతాలకు అతీతం కొందరి
ప్రేమానురాగాలు..
హద్దుల పరిధిలోనే ఒదిగిపోవాలని
వారి కుతూహలం..!!
పెద్దల నిర్ణయాలను
శిరసావహించటం వారి కర్తవ్యం..
వారి భావిజీవితాలకు అవి ప్రగతి
సోపానాలు..
వారి ఏడడుగుల అనురాగ బంధానికి
అవి ఆశాకిరణాలు..!
పెళ్ళి పందిరిలో వినిపిస్తున్నాయి
సన్నాయి మేళాలు..
ఆదర్శ వధూవరులపై వర్షించె
అతిథుల ఆశీర్వచనాలు..!!

*- తంగెళ్ళ పాండురంగశర్మ*

శేషగిరి మరలా కూర్చున్నాడు.

మరచిపోయిన విషయం అలివేలుకు అప్పుడు గుర్తుకొచ్చింది.

ఆమె అడిగింది–

"మీరిక్కడకు వస్తున్న విషయం ఇంట్లో తెలుసునా?"

"తెలుసో... తెలియదో నాకు తెలియదు. జగదీశ్వరి నన్నేమీ అడగలేదు" అన్నాడు శేషగిరి వెంటనే.

"అడక్కపోయినా మీకేమీ అనిపించలేదా? మాటల్లో, చేతల్లో"

వెంటనే జవాబు చెప్పలేకపోయాడతను. దాన్ని బట్టి ఈ విషయం ఇంట్లో తెలిసి ఉంటుందని ఊహించింది అలివేలు.

"ఒక్కటి మాత్రం చెప్పగలను. ఎవరో ఈ విషయాన్ని ఇంట్లో చెప్పారు. జగదీశ్వరి మాటల్లో మార్పును గమనించాను".

"ఎప్పుడైనా ఆమె ఈ విషయం గురించి ఎదురుగానే అడిగితే ఏం చెబుతారు?"

"ఇప్పుడెందుకు అవన్నీ. తర్వాత ఆలోచిద్దాం".

వెళ్ళిపోయాడు శేషగిరి.

మెట్లు దిగుతున్న అతన్ని చూసి మనసులో దిగులుపడింది అలివేలు. తన కారణంగా అత నింట్లో గొడవలు జరగటం తనకిష్టం లేదు. అలాగని శేషగిరి దూరం కావటాన్ని తను భరించలేదు.

ఆనందరావు బతికుంటే తనకీ సమస్య ఉండేది కాదు.

నలభైయేళ్ల అలివేలు ఇరవైయేళ్ల సంసార జీవితంలో నరకాన్ని అనుభవించి ఉంటే ఈ రోజు మరో మగాడి తోడు గురించి ఆలోచించేది కాదు. కానీ అలా జరగలేదు.

ఈ ఇంటిలో శేషగిరి రాకపోకల పర్యవసానం ఏమిటని అలివేలు ఆలోచిస్తున్న ప్పుడు శోభ వచ్చి భోజనానికి రమ్మన్నది.

భోజనానంతరం– ఎందువల్లనో అలి వేలుకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. తన కారణంగా శేషగిరి భార్యను ఎదిరించి ఆమె జీవితాన్ని నరకంగా మారుస్తాడేమోననే భయం ఆమెను వెన్నాడింది. చివరకు ఎప్పటికో నిద్రలోకి జారిపోయింది.

ఆ నిద్రలో ఓ కల. శేషగిరి భార్యను ఇంట్లో నుంచి తరిమి తనని మళ్ళీ పెళ్లి చేసుకున్నాడుట.

మళ్లీ మెలకువ వచ్చింది. ఆ కల నిజ మవుతుందా అనే ఆలోచనతో అలివేలు నిద్ర పోలేదు. ఆలోచనలతోనే తెల్లవారింది.

ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో శేషగిరి వచ్చి ఆఫీసు పని మీద ఊరికి వెళుతున్నాననీ, రాత్రికి తిరిగి రావటం కుదరదనీ చెప్పి వెళ్లాడు.

ఆ సాయంత్రం మొదటి ఆట సినిమాకు శోభ స్నేహితురాలితో కలిసి వెళ్లాక అలివేలు ఏడు గంటలు కావస్తున్నప్పుడు డాబా మీదకు వెళ్లి కుర్చీలో కూర్చుంది.

ఆ రాత్రి వెన్నెల రాలేదు. రాత్రి గడుస్తున్న కొద్దీ చీకటి ముదిరి చిక్కబడింది. వీధి దీపం కూడా వెలగకపోవడంతో డాబా మీద మరింత చీకటిగా ఉంది.

ఆకాశం కేసి చూసింది అలివేలు. ఎక్కడా నక్షత్రాలు కనపడలేదు. నల్లగా కాటుక పులిమి నట్టుగా ఉంది ఆకాశం. ఆ రోజు టీవీలో వాయుగుండం గురించి ప్రకటన చెయ్యటం గుర్తుకొచ్చింది.

విసురుగా వీస్తున్న గాలికి ఆమె పమిట ఎగురుతోంది.

ఎదురుగా ఉన్న కుర్చీ శేషగిరికోసం ఎదురు చూస్తున్నట్టుగా ఉంది.

మళ్లీ ఏదో ఆశ.... అతను కేంపు నుంచి రాత్రికే తిరిగి వస్తాడేమోనని.

అందుకే చీకట్లో మెట్లవైపు చూస్తూ కూర్చుంది.

అప్పుడు-

ఎవరో మెట్లెక్కుతున్న అడుగుల చప్పుడు వినిపించి శేషగిరనే అనుకుంది అలివేలు. కానీ డాబామీదకు వచ్చిన మనిషిని ఆడదిగా గుర్తించి ఒకింత ఆశ్చర్యపడి "ఎవరు?" అన డిగింది.

"నా పేరు జగదీశ్వరి... శేషగిరి గారి భార్యను"

షాక్ ఫీలయి భయపడింది అలివేలు. ఊహించని ఆగమనం.

ఖాళీగా ఉన్న కుర్చీని చూసి "ఇక్కడ కూర్చుంటాను. మీతో కొంచెం మాట్లాడాలి" అన్నది జగదీశ్వరి.

"కూర్చోండి" అన్నది అలివేలు గొంతు పెగుల్చుకుని.

చీకట్లోనే ఆమెను పరిశీలనగా చూసింది అలివేలు. తనకంటే మంచి శరీరపు రంగు. అందచందాలు గలదిగా అనుకుని ఆమె ఏం మాట్లాడుతుందా? అనే ఆలోచనలో పడింది- మనసులో భయపడుతూ-

అలివేలు ఆలోచనలను చదివినట్టుగా ఆమె-

"భయపడకండి. నేను మీతో గొడవపడ డానికి, పతి భిక్ష పెట్టమని అడగటానికి రాలేదు. మనసు విప్పి మాట్లాడడానికి వచ్చాను. సాటి ఆడదానిగా నేను మిమ్మల్ని అర్థం చేసుకోగలను. మనం ఎక్కువగా మనకు లేని దాని గురించి, కోల్పోయిన దాని గురించే ఆలోచిస్తాం గదా"

-అనడిగి కొంచెం సేపు ఆగింది.

ఆమె మాటలు అలివేలును ఆశ్చర్యంలోకి నెట్టాయి. తనని తిట్టిపోస్తుందని అనుకున్నది. కానీ అలా జరగలేదు. ఇంకేం చెబుతుందో??

మళ్లీ మొదలుపెట్టింది.

"భర్త మరణించటంతో మీరు ఆయన ప్రేమానురాగాలకు దూరమయి, తపించి వాటి కోసం శేషగిరిగారిని మీ జీవితంలోకి ఆహ్వానించారు. కానీ నేను రెండు నెలలుగా భర్త ఉండి కూడా అన్నిటికీ దూరమయినాను. ఆ ప్రేమానురాగాలు ఎక్కడ దొరుకుతాయా అని చూస్తుంటే ఈ మధ్యనే నాకు ఒకాయనతో పరిచయమయ్యింది. ఆయన భార్య ఇటీవలనే చనిపోయిందిట. నాతో చాలా అభిమానంగా మాట్లాడాడు. నాతో మాట్లాడుతుంటే ఆయనకు తన భార్యతో మాట్లాడుతున్నట్టే ఉందిట. రోజూ ఎన్నోసార్లు ఫోన్ చేస్తున్నాడు. శేషగిరిగారి దగ్గర కోల్పోయిన ప్రేమానురాగాలను నేను ఆయన దగ్గర పొందాలని అనుకుంటున్నాను. ఇందులో గొప్ప విశేషం ఏమీ లేదు. మనం వెతుక్కునేది మనం పోగొట్టుకున్నవాటి గురించే కదా! ఇంతకీ నేను చెప్పేదేమిటంటే మీరు అనవసరంగా నా గురించి ఆలోచించి భయ పడకండి. ఇందులో మీ తప్పు ఏమీ లేదు... వస్తాను".

నెమ్మదిగా వెళ్లిపోయిందామె-

చీకట్లో శిలలా అలాగే కూర్చుండిపోయింది అలివేలు. ఆమె అలా మాట్లాడుతుందని అనుకోలేదు.

ఆమె అన్నట్టుగా ఇందులో తన తప్పులేదా?

ఐతే తప్పు ఎవరిది? శేషగిరి గారిదా?

ఆ మర్నాటి రాత్రి కూడా వాయుగుండం ప్రభావం వల్ల వర్షం రాలేదు. వెన్నెల కూడా రాలేదు.

రాత్రి ఎనిమిది గంటలు కావస్తున్నప్పుడు డాబా మీద ఒంటరిగా కూర్చున్న అలివేలు దగ్గరకు వచ్చాడు శేషగిరి.

క్రితం రాత్రి అతని భార్య జగదీశ్వరి రావటం గురించి చెప్పింది అలివేలు. వెంటనే ఉలిక్కిపడి తర్వాత ఆమె మాటల్ని తేలిగ్గా కొట్టి పారేశాడు.

"నన్ను బెదిరించటానికి జగదీశ్వరి అలా చెప్పి ఉంటుంది. తనేమిటో నాకు తెలుసు. జగదీశ్వరి అలాంటి మనిషి కాదు" అన్నాడు శేషగిరి చిన్నగా.

అప్పుడామె-

"మీరలా అనుకోవటం తప్పు కాదు. మన గురించి తెలిసినప్పుడు మీ భార్య కూడా మీ గురించి మీలాగే అనుకుని ఉంటుంది. కానీ మరిప్పుడేం జరుగుతోంది?" అనడిగింది. ఆమె అలా అనటంతో శేషగిరి కొంచెం ఆలోచనలో పడినట్టు మౌనంగా ఉండి ఆ తర్వాత-

"నువ్వేన్నయినా చెప్పు. జగదీశ్వరి మాటల్ని నేను నమ్మను. ఆమె వల్ల మనకు ఎటువంటి ఇబ్బందీ లేదు. ఒక వేళ తను చెప్పిందే నిజమైతే ఆమె నాకు శాశ్వతంగా దూరమవుతుంది. నన్ను నీ ఇంటికి రాకుండా ఎవ్వరూ ఆపలేరు. మళ్లీ రేపు కలుస్తాను".

- అని అలివేలు జవాబుకు ఎదురుచూడ కుండా కిందికి వెళ్లిపోయాడు శేషగిరి.

అలా వెళ్లిన శేషగిరి తిరిగి ఎప్పటికీ అలివేలు ఇంటి గడప తొక్కలేదు. తన మొహాన్ని ఆమెకు ఎక్కడా చూపలేదు. ఆ ఊర్నించి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఎటో దూరంగా వెళ్లిపోయాడు. ❋

